# దేవుడు ఏడుస్తున్నాడు



సాయంత్రం నాలుగు గంటలు !

ఆకాశంలో సూర్యుడు హఠాత్తుగా కను మరుగయ్యాడు. నలుదిక్కులా నల్లటి మేఘాలు చీకటి తెరల్లా అలుముకుంటున్నాయి. చల్లటి గాలి కూడా తోడయింది. ఇప్పుడో, కాస్సేపటికో కుంభవృష్టిగా వర్షం కురవడం ఖాయం...

కిటికీలోంచి బయటకి చూస్తూ అనుకున్నాను! ఎప్పుడు బడి గంట కొడతారా, ఎప్పుడు ఛెంగు ఛెంగున బయటికి దూకుదామా అన్న ఆత్రంలో పిల్లలు గోలగోలగా కబుర్లు చెప్పుకుంటున్నారు. బడిగంట కొట్టడానికింకా అరగంట సమయం ఉంది. అరగంట ముందుగా పిల్లల్ని విడిచి పెట్టడమా, మానడమా అన్న మీమాంసలో పడినా, వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని బడి విడిచి పెట్టడానికే నిర్ణయించుకున్నాను.

నే నీ ప్రాథమిక పాఠశాలకు ప్రధాన

ఉపాధ్యాయుడ్ని నాతోబాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఒకటి నుంచి అయిదు వరకూ తరగతులున్నాయి. పట్టణానికి పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ పల్లెటూరది... పేరు 'నాగులపాడు'. ఈ పల్లెటూరుకీ, పట్టణానికీ మధ్య గతుకుల కంకరరోడ్డు ఉంది. ఆ కంకర రోడ్డు మీదుగా ఇప్పుడిప్పుడే పట్టణపు పోకడల్ని, కల్తీ నాగరికతనీ (ఎ) అరువు తెచ్చుకుంటున్న ఈ నాగులపాడులో భూస్వాములున్నారు. కామందులున్నారు. చిన్నకారు రైతులున్నారు. కూలీలున్నారు. అన్ని కులాలవాళ్ళూ ఉన్నారు. మేడలున్నాయి. మిద్దెలున్నాయి. ఊళ్లో అపార ధన సంపద ఉంది. అంతులేని దారిద్ర్యమూ ఉంది ఊరి చుట్టూ ఉన్న పొలాల్ని నిత్య హరితం చేస్తూ, ఉన్నట్టుండి ఉరకలు వేసి ఊరకనే ఊరిని ముంచెత్తే నాగుటేరు ఉంది !

ఊరు మొత్తం రెండువేలకు పైగా గడపలుంటాయి. ఊరికంతా ఒకటే ప్రాథమిక పాఠశాల ! పిల్లలు ఎక్కువగా రైతు కూలీ కుటుంబాలకు చెందిన వాళ్లయినా, బడికి అధిక సంఖ్యలోనే హాజరవుతుంటారు.

నాగులపాడులో నాగుపాములు లేవు. నాగజెముడు డొంకలు లేవు. నాగుపాముల్లాంటి మనుషులు మాత్రం ఉన్నారని నా అభిప్రాయం.

నాలుగేళ్లుగా ఈ ఊళ్లో ఉద్యోగం చేస్తున్నా నాకెందుకో రాత్రిళ్లు ఒకనాడూ సుఖంగా నిద్రపట్టలేదు. నిద్ర పట్టకపోవడానికి నా ఆరోగ్యం లోపమా, ఈ ఊరి వాతావరణ ప్రభావమా అన్నది నేనింకా పూర్తిగా తేల్చుకోలేకపోయాను. నాకింకా ఉద్యోగ విరమణకు అయిదేళ్ల గడువు ఉంది. ఈ అయిదేళ్ళూ నాగులపాడులో గడపక తప్పదనుకుంటే నా గుండె గుబగుబ లాడుతుంది!

"మాస్టారూ !"

ఉలికిపడినట్లయి తల ప్రక్కకు తిప్పాను. నా సహోపాధ్యాయుడు సత్యమూర్తి వచ్చి టేబులు ముందున్న కుర్చీలో కూర్చున్నాడు.

"మాస్టారూ ! ఈ రోజు రాత్రికి మన ఊళ్లో చాలా దారుణంగా కొట్లాటలు జరిగిపోవచ్చు. రాత్రికి మీరసలు తలుపులు తెరవకండి. ఎంతమంది కొట్టుకు చస్తారో, ఏమిటో ? రంగారావు వర్గం వాళ్ళు ఏభై బల్లేలతో సిద్ధమవుతున్నారట. కొండయ్య వర్గం వాళ్లు సరేసరి. గొడ్డళ్లు, గునపాలు, కత్తులు కటార్లు రాత్రికి ఇరువర్గాల వాళ్ళు మన బడి దగ్గరే పొట్లాడుకుంటారని వాళ్ళ మనిషి ఒకడు నాకు రహస్యంగా చెప్పాడు. అంతేకాదు..."

సత్యమూర్తి మాస్టారు ఇంకా ఏదో చెప్పుకు పోతున్నాడు. నాకు గుండె బేజారెత్తిపోయింది. మనసులో దిగుళ్ల మొదళ్లన్నీ కదిలాయి. ఈ బడి ఊరికి చివరిగా ఉంది. మేం, ఉండే ఇళ్లుకూడా బడికి దగ్గరగానే ఉన్నాయి. ఏం జరుగుతోందో రాత్రికి ? ఈ ఊళ్ళో గొడవలకి, కొట్లాటలకి, కుమ్ములాటలకి అంతులేదు. ఈ ఊరికి గతం లేదు. వర్తమానం శూన్యం. భవిష్యత్తు అంధకారం! తలచుకుంటే అంతరంగం ఆవేదనతో గడ్డకట్టుకు పోతోంది !

సంవత్సరం క్రితం !

ఒక రోజు ఉదయం ఊరి ప్రెసిడెంటు రంగారావు మనుషులు పదిమంది నా ఇంటికి వచ్చారు. వచ్చిన వాళ్లలో ప్రెసిడెంటు బావమరిది ఉన్నాడు. అతని ఇద్దరు తమ్ముళ్ళూ ఉన్నారు. ఇంకా పంచాయతీ సభ్యులు, ఇతర పెద్దమనుషులూ ఉన్నారు. నేను చటుక్కున కుర్చీలోంచి లేచాను. ఆశ్చర్యంతో లోపలికి రమ్మని ఆహ్వానించాను. వాళ్ళు రాలేదు. వీధిలోనే నిలబడ్డారు.

"మాస్టారూ ! పెద్ద వీధి మొదట్లో కొత్తగా దేవుడి గుడి కడుతున్నాం. మీ పేరున వంద రూపాయలు చందా వేశాం. జీతాలొచ్చిన తరువాత ఇవ్వండి !"

నా పేరు రాసుకుని వెళ్ళిపోతున్నారు వాళ్ళు.

"ఏ దేవుడి గుడి బాబూ !" ఉండబట్టలేక కావాలనే అడిగాను.

వాళ్లలో ఒకడు ఆ దేవుడి పేరు చెప్పాడు.

నేను మౌనంగా ఉండిపోయాను. ఈ ఊళ్లో ముగ్గురు దేవుళ్లకీ మూడు గుళ్లు ఉన్నాయి. అవిగాక ఊరి చివర అమ్మవారికి ప్రత్యేకంగా ఒక గుడి ఉంది. ఈ గుళ్లు చాలక ఊళ్లో మరో గుడి వెలుస్తున్నదా? నాలో నేను ప్రశ్నించుకున్నాను. నాకు నేను సమాధానం చెప్పుకున్నాను. నాకు దేవుడంటే అయిష్టత లేదు. నేను నాస్తికుడ్ని కానే కాదు. ఉభయ సంధ్యల్లోనూ ఒక అరగంట సమయం పూజ గదిలో గడపకపోతే నాకు మనస్సు స్థిమితంగా ఉండదు !

నాగులపాడులో పెద్ద వీధికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. పెద్దవీధిలోనే ఊరి పెద్దల మేడలు న్నాయి. మిద్దెలున్నాయి. షావుకార్ల దుకాణాలు న్నాయి. పంచాయతీ కార్యాలయం ఉంది. రావిచెట్టూ, రచ్చబండా కూడా ఉన్నాయి. పెద్ద వీధి ఎప్పుడు సందడిగా, ఒక సంతలాగే ఉంటుంది.

జనం గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. ఉత్సవాలయినా, ఊరేగింపులయినా, ఈ వీధిలోంచే మొదలవు తుంటాయి. ఒక్క మాటలో పెద్ద వీధి ఊరికి నడిబొడ్డులాంటిది ! ఆ పెద్దవీధి మొదట్లో ప్రెసిడెంటు రంగారావు ఆధ్వర్యంలో మరుసటి నెల మొదటి వారంలో కొత్త దేవుడి గుడి నిర్మాణం ప్రారంభమయింది. ప్రారంభోత్సవానికి ఒక స్వామిజీ వచ్చారు. పూజలు చేసి పునాది రాయి వేశారు.

నేను వంద రూపాయలు చందా ఇచ్చాను. నాతోబాటు నా సహోపాధ్యాయులు, పిల్లలూ దేవుడి గుడికి చందాలిచ్చారు. కూలీలు, తాపీ మేస్త్రీలు, శిల్పకారులు ఎక్కడినుంచో వచ్చి పని ప్రారంభించారు.

ప్రెసిడెంటు రంగారావు పలుకుబడీ, పరపతీ ఉన్నవాడు. నలుగుర్నీ కలుపుగోగలిగినవాడు. మంచి మాటకారి. మనిషి సన్నగా వెదురుబద్దలా ఉన్నా, ఏదైనా పని తలపెడితే అది పూర్తయ్యేవరకూ విశ్రమించని మనస్తత్వం అతనిది. సత్తా ఉన్నవాడు. అధికారం చేతిలో ఉంది. అంగబలం ఉంది. దేవుడి గుడి నిర్మాణ విషయంలో అతని పట్టుదల, దీక్ష చూస్తూంటే నాకెంతో విస్మయం కలిగేది. గుళ్లోకి వెండి విగ్రహాలు రప్పించాడు. ఆ విగ్రహాల్ని ట్రాక్టర్ల మీద చుట్టు ప్రక్కల ఊళ్లలో ఊరేగింపు చేయించి, చందాలు వసూలు చేయించాడు. నేను బడికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు గుడి నిర్మాణం ఆసక్తిగా గమనించేవాడిని. అనతికాలంలోనే గుడి ఆకారం పైకి లేచింది. గుడి చుట్టూ ప్రహరీ గోడలు నిలబడ్డాయి. గుడి ప్రాంగణంలో ధ్వజస్థభం వెలిసింది. గుడి నిర్మాణం నా కెంతో ఆనందాన్ని చ్చింది. ఒక అంతమైన అనుభూతిని మిగిల్చింది.

ఆ రోజు సాయంత్రం !

బడి తలుపులు మూసి ఇంటివైపుగా నడుస్తున్నాను. అలసిపోయిన దినకరుడు ఆత్రంగా అమ్మ ఒడిలోకి జారిపోతున్నాడు. సంజకెంజాయ వెలుగులు నాగులపాడు వీధుల్లో నీడల్ని పరుస్తు న్నాయి. రచ్చబండ మధ్య రావి చెట్టు మీద కాకులు కొంగలు కాట్లాడుకుంటున్నట్టుగా అరుస్తున్నాయి. ఆ అరుపులేవీ వినబడనట్లుగా ఇద్దరు పెద్దమనుషులు రచ్చబండ మీద పులీ, మేకలై పోట్లాడుకుంటున్నారు.

'మాస్టారూ ! మీ వద్దకే వస్తున్నాం. ఆగండి !' ఎవరో పలకరించినట్లయి, తల తిప్పి చూశాను. మునసబు కొండయ్య మనుషులు ఓ ముప్ఫైమంది ప్రక్క వీధిలోంచి గుంపుగా నడిచి వస్తున్నారు. వాళ్ళలో మునసబు ముగ్గురు కొడుకులూ ఉన్నారు. మునసబు మేనమామ, మావగారు ఉన్నారు. కరణం చిట్టిపంతులు ఉన్నాడు... కామందు వీరాస్వామి తదితర పెద్ద మనుషులు ఉన్నారు. నేను నివ్వెరపడుతూ నిలబడిపోయాను. వాళ్ళు నాదగ్గరగా వచ్చారు.

"పెద్ద వీధికి రెండో వైపుగా మేమూ ఒక గుడి కడుతున్నాం. మాస్టారూ ! వాస్తు ప్రకారం వాళ్లు కట్టిన గుడి వల్ల ఊరికి మంచి జరగదట. అందుకే ఈ నిర్ణయానికొచ్చాం. మీరు వాళ్లకు వంద రూపాయలు చందా ఇచ్చారటగా ! మాకు

రెండొందలు ఇవ్వండి !"

ఆజ్ఞాపించినట్టుగా చందా పుస్తకం నా చేతిలో పెట్టాడు మునసబు కొడుకు మంగపతి.

నాకు మెదడు మొద్దుబారినట్లయింది.

పెద్దవీధి మొదట్లో ప్రెసిడెంటు రంగారావు ఒక గుడికి నిర్మాణం జరుపుతుంటే అదే వీధికి మరోవైపు మునసబు ఇంకో గుడి కట్టే ప్రయత్నం చేస్తున్నాడా ! దీని ఆంతర్యం ? చందా పుస్తకంలోకి తొంగి చూశాను. దాతలు ఎవరెవరి పేర్లో రాసి ఉన్నాయి. ఎదురుగా వందలు, వేలు చందాలు వేసి ఉన్నాయి. దేవుడి గుడి నిర్మాణార్థం... ఎవరీ దేవుడు? కళ్లజోడు సవరించుకుని దేవుడి పేరు చదివాను. ప్రెసిడెంటు గుడిలోని దేవుడూ, ఈ దేవుడూ ఒకరే! ఒక దేవుడికి రెండు గుళ్లు నిర్మాణం !

వందలు చందా లిచ్చే ఆర్థిక పరిస్థితి కాదు నాది. బ్రతకలేక బడిపంతులని ఎవరన్నారో గానీ, వాళ్లు నాలాంటి వాళ్లని దృష్టిలో పెట్టుకునే వ్యాఖ్యానించి ఉంటారు. బ్రతకలేని తనం నాలాంటి బడిపంతుళ్లకి ఎప్పటికీ వర్తిస్తుంది.

ఇద్దరాడ పిల్లలు పెళ్లికి ఎదిగి కూర్చున్నారు. ఒక్కగా నొక్క సుపుత్రుడు నిరుద్యోగ పర్వంలో నిట్టూర్పులు విడుస్తూ దేశ ద్రిమ్మరియై తిరుగుతున్నాడు. అనారోగ్యంతో బాధపడే అర్ధాంగికి వైద్య నిమిత్తం నెలనెలా సగం జీతం జమ చేయవలసిందే ! ఏది ఏమైనా, ఈ ఊళ్లో నాది చాలా సున్నితమన పరిస్థితి. ఉపాధ్యాయుడన్న విలువ, గౌరవం ఎవరికీ లేవు అహంకారం, మూర్ఖత్వం మూర్తీభవించిన మనుషుల మధ్య నోరు మెదపకుండా, మసలుకోవడమే ఉత్తమోత్తమం అని ఎప్పుడో నిర్ణయించుకున్నాను. అదీగాక, అటు ప్రెసిడెంటు పిల్లలూ, ఇటు మునసబు తాలూకు పిల్లలూ నా బడిలో ఉన్నారు. ఎవర్నీ కాదనలేని, ఎదిరించి మనుగడ సాగించలేని పరిస్థితి !

"ఏంటయ్యా, పంతులూ ! అంతగా ఆలోసిత్తున్నావ్ ? చందా వేయడం ఇష్టం లేదా ? చెప్పు ?" మునసబు మరో కొడుకు రెట్టించాడు.

"అది కాదు, బాబూ ! రెండొందలు చందా అంటే... అది నాకు చాలా భారం అవుతుందనీ !'

"భారం ఏంటయ్యా ! బడిపంతుళ్లకి బోలెడు జీతాలు పెరిగాయిగా. దేవుడి కార్యం ఇది. ఆళ్లకిచ్చిన వందరూపాయల మీదా, ఎంతో కొంత ఎక్కువ రాయి !" గుంపులో నుంచి ఎవరో గద్దించినట్టుగా అన్నాడు. నేను మారు మాట్లాడకుండా నూటయాభై చందారాసి పుస్తకం వాళ్ల చేతికిచ్చాను. వాళ్లు సణుక్కుంటూ వెళ్ళిపోయారు !

ఆలోచనగా నేను ఇంటి వైపు అడుగులు వేశాను.

ఒకే ఊళ్ళో ఒకే వీధిలో, ఒకే దేవుడికి రెండు గుళ్ళు నిర్మాణం !

మనుషుల్లో నిండైన దైవభక్తికి తార్కాణం అంటే ఇదేనేమో !

మునసబు కొండయ్య, కొండలా ఉంటాడు. అతనికి కొండంత ఆస్తి కూడా ఉంది. పెద్ద వీధికి రెండో వైపుగా అతను. అట్టహాసంగా మరో గుడికి పునాదులు తీయించాడు. ఆరు నెలల వ్యవధిలో నాగులపాడులో ఒకే దేవుడికి రెండు గుళ్లు నిర్మాణం జరిగింది. జనం ఆశ్చర్యంలో కొందరూ... ఆనందంలో కొందరూ, అయోమయంలో మరికొందరూ చూస్తూ ఉండిపోయారు.

తన గుళ్లో విగ్రహ ప్రతిష్ఠాపనకు ప్రెసిడెంటు రంగారావు ఉత్తరాది నుంచి ఒక పీఠాధిపతిని తీసుకువచ్చాడు. మునసబు కొండయ్య దక్షిణాదిలో పేరెన్నికగన్న ఒక బాబా గారితో తన గుళ్లో ప్రాణ ప్రతిష్ట చేయించాడు. రెండు గుళ్లలోనూ దేవుడి కళ్యాణాలు రంగరంగ వైభోగంగా జరిగాయి. ఎందరో వేద పండితులు విచ్చేశారు. రాజకీయ నాయకులు వచ్చారు. రంగస్థల కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మేళాలు, తాళాలు ! కొయ్య బొమ్మలాటలు, కోలాటాలు, విచిత్ర వేషాలు, వీరాంగాలు ! ఒకటే సందడి ! ఊరు ఊరంతా పండుగ జరుపుకుంది. ఆనందం అర్ణవమై పొంగి పొరలింది. జరిగిన సంబరాల

ఊరేగింపులో ఇరువర్గాలు బాణసంచా బ్రహ్మాండం బ్రద్దలయ్యేలా పేల్చారు.

చివరి రోజున రంగారావు మనుషులు వేసిన ఒక తారా జువ్వ కొండయ్య మేనల్లుడు నెత్తిమీద పడటంతో ఆ వర్గం వాళ్లు వీరావేశంతో రెచ్చిపోయారు. ఇరుపక్షాలవాళ్లు పోట్లాటకు పొట్టేళ్ళలా తలపడ్డారు. అదృష్టవశాత్తూ ఆ సంబరాలకి వచ్చిన పోలీసుల ప్రమేయంతో పోరు తాత్కాలికంగా సద్దుమణిగింది.

ఇది జరిగిన మూడోనాడు ప్రెసిడెంటు రంగారావు కట్టించిన గుడిలో మూల విరాట్టు విగ్రహం విచిత్రంగా మాయమయింది. ఎవరు చేశారీ పని ? దోపిడీ దొంగలు ఎత్తుకుపోయారా ? ఊళ్లో కలవరం ! గోల... అలజడి ! ప్రెసిడెంటు తోక తొక్కిన త్రాచులా బుసలు కొట్టాడు. వారం రోజులు గడిచాయి. విగ్రహం ఏమయిందో ఎవరికీ అంతుపట్టలేదు.

ఆ మర్నాడు మునసబు కొండయ్య గారి గుడిలో విగ్రహాన్ని కూడా ఎవరో ఎత్తుకుపోయారు. ఇప్పుడు దేవుడు గుళ్లు రెండింటిలోనూ దేవుడు లేడు. దీపారాధన లేదు. పూజారులు నెత్తీ నోరూ బాదుకున్నారు. జనం నోళ్లు వెళ్లబెట్టారు. దేవుడు గుళ్లు కట్టించిన పెద్దమనుషులు మాత్రం దెయ్యాలుగా మారిపోయారు. ఒకనాడు తెల్లవారే సరికి ప్రెసిడెంటు గుడి గోడలు గునపాల పోట్లకు గురయ్యాయి. ఆ మరునాడు మునసబుగారి గుడి ధ్వజస్థంభం కుప్పకూలిపోయింది. ఇద్దరి మధ్యా పగలు పెరిగాయి. కక్షలు కసిని పెంచుకున్నాయి.

ప్రెసిడెంటు బావమరిది ఒకరోజు చీకట్లో పొలం నుంచి వస్తూంటే అతని తల పగిలింది. అది జరిగిన మూడోనాడు మునసబు మనుషులు నలుగురు కత్తిపోట్లకు గురయ్యారు. ఎప్పుడేం జరుగుతుందో తెలియని విషమ పరిస్థితి ఊళ్లో జనం గుండెలు బితుకు బితుకు మంటున్నాయి. తరచూ కొట్లాటలు, కుమ్ములాటలు జరుగుతున్నాయి. పోలీసులు పదేపదే ఊళ్లోకి అడుగు పెడుతున్నారు.

అసలీ గొడవలకీ మూలకారణం ?

ప్రెసిడెంటు రంగారావు చేతిలో అధికారం ఉంది. మునసబు కొండయ్యకు పదవి లేదు. అధికారం లేదు. కొండయ్యకు కొండంత ఆస్తి ఉంది. అతను అగ్రవర్ణానికి చెందినవాడు. రంగారావుకు ఆర్థిక బలం లేదు. అతను వెనుకబడిన వర్గంలోంచి వచ్చాడు. ఇద్దరి పెద్దమనుషుల మధ్యా కులాల పట్టింపులున్నాయి. ఆర్థిక, రాజకీయ అంతరాలున్నాయి.

ఊళ్లో పెద్ద వీధి మొదట్లో గుడి కట్టడానికి వీల్లేదని మొదట్నుంచీ మునసబుగారి వాదన. అదే స్థలంలో గుడికట్టి తీరుతానని తన పంతం నెగ్గించుకున్నాడు ప్రెసిడెంటు. తమ మధ్య ఉన్న అంతరాల్ని నిరూపించుకోవడం కోసం దేవుడ్ని పావుగా నిలబెట్టుకున్నారు వాళ్ళు. అసలీ దేవుడు ఎవరు ? ఎక్కడ నుంచి వచ్చాడు...?

మంచి వైపు ప్రస్థానం సాగించడం కోసం, మానవత్వం వైపు మనసును మళ్ళించడం కోసం, మనుగడ ప్రశాంతంగా గడవడం కోసం మనిషి దేవుడ్ని సృష్టించుకున్నాడు. ఒక మతం పేరు పెట్టుకున్నాడు. కానీ జరుగుతున్నదేమిటి ? దేవుడి పేరు మీదుగా జరుగుతున్న ఈ ఇద్దరు పెద్దమనుషుల ప్రచ్ఛన్న యుద్ధంలో ఊరు రావణకాష్ఠంలా మారిపోయింది. బల్లేలతో పొడుచుకోవడం, గొడ్డళ్లతో నరుక్కోవడం, కత్తులతో కుత్తుకలు తెగకోసుకోవడం ఈ ఊరికి కొత్త కాదు(ట) ! ఊరి గత చరిత్ర పుటల్లో ఎన్నో రక్తపు మరకలున్నాయి(ట) !

అయితే ఈ సారి ముసలానికి దేవుడు కారణభూతుడయ్యాడు. మనుషుల మధ్య ద్వేషానికీ, పగకీ, ప్రతీకారానికీ దేవుడు కేంద్రబిందువయ్యాడు. నాగులపాడు వల్లకాడుగా మారే పరిస్థితి వచ్చేసింది.

ఈ నేపథ్యంలో ఈ రాత్రికి ఎంత మారణ కాండ జరుగుతుందో ? ఎంతమంది పొడుచుకుని చస్తారో ? ఎన్ని కొంపలు కూలి పోతాయో !

అందరూ కలిసి ఈ బడి దగ్గరే... ఇక్కడే కొట్టుకుని చస్తారేమో ?

"మాస్టారూ ! మీరేదో ఆలోచనలో పడి నట్టున్నారు. బయట వర్షం పడుతోంది. పిల్లల్ని విడిచిపెట్టడం ఎలా ?"

సత్యమూర్తి మాస్టారి పిలుపుతో అదిరిపడి బాహ్యాలోకంలోకి వచ్చాను. ఆలోచనల్ని విదించుకున్నాను. బయట వర్షం దడదడమంటూ కురుస్తోంది. ఫెళఫెళార్భాటాలతో ఫిరంగి మోతల్లా ఉరుములు వినబడుతున్నాయి. వీటికి తోడు గాలి కూడా ఉధృతంగా వీస్తోంది. అయ్యయ్యో ! ఏంటిటీ చేయడం ? పిల్లల్ని విడిచి పెట్టేద్దామను కుంటూండగానే వర్షం పెద్దదయిపోయింది. ఎలా ఇప్పుడు ?

"ఫరవాలేదులెండి ! సత్యమూర్తిగారూ ! పిల్లల్ని అలా కూర్చోనివ్వండి. వర్షం తగ్గిన తరువాతే పంపిద్దాం !" తేరుకుంటూ అన్నాను.

వర్షం తగ్గలేదు. అది మరింత ఎక్కువయి అలా కురుస్తూనే ఉంది. బయట వర్షాన్ని ఉరుముల్ని, మెరుపుల్నీ పిల్లలు కేరింతలు కొడుతూ చూస్తున్నారు. కారుమబ్బులు లోకం మీద తమ చీకటి తెరల్ని పూర్తిగా కప్పేశాయి.

ఆ వర్షాన్నీ, గాలినీ చూస్తూంటే నాకో ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన నాకెంతో సంతృప్తినిచ్చింది. అమితానందాన్ని కలిగించింది.

ఈ వర్షం, గాలీ ఇంకా ఎక్కువై, రాత్రంతా కుంభవృష్టిలా ఇలాగే కురిస్తే ఈ ఊళ్లో రాత్రికి జరిగే మారణకాండ ఆగిపోతుందేమో ! రేపటికి ఇరువర్గాల మనుషులు మారిపోతారేమో ! వాళ్ళ మనసులు మారి ఒకరినొకరు చంపుకునే ప్రయత్నాన్ని విరమించుకుంటారేమో ! పగ స్థానంలో ప్రశాంతత నెలకొంటుందేమో !

నా ఆలోచన నాకే నవ్వు తెప్పించింది. అయినా అలా జరగాలని కోరుకుంటూ రెండు నిముషాలు కళ్లు మూసుకున్నాను. కళ్లు మూసుకున్న నా కెన్నో సుందర దృశ్యాలు కనబడుతున్నాయి. నాగులపాడు ప్రశాంత నిలయంలా మారిపోతున్నట్లనిపించింది. మనుషులందరూ శాంతి, సౌహార్ద్రల కాంతి పుంజాలతో వెలిగిపోతున్నట్టనిపించింది. వసుధైక కుటుంబం నినాదం ఒక్కటే ఓంకార నాదంలా ప్రతిధ్వనిస్తున్నట్టు అనిపించింది...

మనుషుల్లో మానవత్వం ఒక్కటే మణిదీపంలా వెలుగుతున్నట్టనిపించింది. చటుక్కున కళ్ళు తెరిచాను.

పిల్లల అరుపులు, కేకలు, హాహాకారాలు... అమ్మా ! నాన్నా ! ఏడుపులు, పెడబొబ్బలు ! అదిరిపడ్డాను. అయ్యయ్యో ! ఏం జరిగింది ? ఏం జరుగుతోంది ? ఎవరు ఏం చేస్తున్నారు ? నాకేమీ అర్థం కావడం లేదు. నేను కుర్చీలోంచి ఎగిరిపడ్డాను. నా కళ్లముందు చీకటి. నేనేమైపోతున్నానో నాకు తెలియడం లేదు. నాకు స్పృహ తప్పిపోతున్నట్లుగా అనిపించింది...!

... ... ...

ఎప్పటికో నాకు స్పృహ వచ్చింది. బరువుగా బాధగా నేను కళ్లు విప్పేసరికి ఎదురుగా ఇద్దరు డాక్టర్లు నావైపు దీక్షగా చూస్తున్నారు. నాకు ఒళ్లంతా శిథిలమైపోయినట్టుగా ఉంది. శరీరంలో ఏ భాగమూ నా స్వాధీనంలో ఉన్నట్టు లేదు. నేనెక్కడున్నాను...? ఏం జరిగింది ? లీలగా జరిగింది గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాను. చుట్టుపక్కల అన్ని వైపుల నుంచి హృదయ విదారకంగా మూలుగులు వినబడుతున్నాయి. ఆసుపత్రిలో ఉన్నానేమో ! ఒక ప్రక్కగా నా భార్యా, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మరోవైపు ప్రెసిడెంటు రంగారావు చిన్నపిల్లాడికి మల్లే ఏడుస్తున్నాడు. అతనికి కొంచెం దూరంలో మునసబు కొండయ్య కూడా ముఖం కప్పుకున్నాడు. ముద్దాయిలా తల వంచుకున్నాడు !

"ఏం జరిగింది ? ఎందుకు మీరలా ఏడుస్తున్నారు ? రాత్రి కొట్లాటల్లో చాలామంది ప్రాణాలు కోల్పోయారా ? ఎవరు ఎవర్ని పొడుచు కున్నారు ? ఎవరు ఎవర్ని చంపుకున్నారు? ఎన్ని

తలలు బద్దలయిపోయాయి ? ఎన్ని కొంపలు కూలిపోయాయి ? ఎన్ని రక్తపుటేరులు ప్రవహించాయి ? మాట్లాడరేం ? మీకిప్పటికైనా సంతృప్తిగా ఉందా ? మీ దాహం తీరిందా ? నాగులపాడు వల్లకాడుగా మారిపోయిందా ? చెప్పండి, బాబూ ! చెప్పండి ?

నా పెదాలు కదిలాయి. నా గొంతు పలికింది. నా మాటలు వాళ్ళకు వినబడ్డాయో, లేదో ?

"ఘోరం జరిగిపోయింది, మాస్టారూ ! బడి పైకప్పు ఈ వర్షానికి కుప్పకూలిపోయింది. పిల్లల్లో చాలామంది దారుణంగా..." ప్రెసిడెంటు రంగారావు బావురుమన్నాడు.

నాకు గుండె పగిలిపోయింది.

బడి పైకప్పు కూలిపోయిందా ? అంటే ఆ కప్పు క్రింద, అన్నెం పున్నెం ఎరుగని అంతమంది పిల్లలూ, అన్యాయంగా, అమానుషంగా అమ్మా ! నాన్నా ! అంటూ ఆర్తనాదాలతో, హాహాకారాలతో అలాగే అణిగిపోయారా ! ఎవరైనా బ్రతికి బయటపడ్డారా బాబూ ? ఎంతమంది విగతజీవులయ్యారు ? ఎంతమంది వికలాంగులయ్యారు ? అయ్యో ! ఎంత ఘోరం ? ఎంత దారుణం ? ఎంతటి మారణ హోమం ?

ఈ ఘోరానికి బాధ్యులెవరు ప్రెసిడెంటుగారూ ? ఈ నేరం ఎవరిది మునసబుగారూ ? బడి శిథిలావస్థలో ఉందనీ, దానికి వయసు చెల్లిపోయిందనీ ఊరి పెద్దలు మీకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాను. మీరు నా మొర వినలేదు. అధికారులకీ ఎన్నో అర్జీలు పెట్టాను. వాళ్లూ నాగోడు వినిపించుకోలేదు. మీకు గుళ్లు ముఖ్యం. దేవుళ్లు ముఖ్యం, మతాలు ముఖ్యం ! రాజకీయాలు ముఖ్యం... అధికారాలు ముఖ్యం. ఊరి సంక్షేమం కాదు. మీ మూర్ఖత్వానికి పర్యవసానంగా పసి ప్రాణాలు నికృష్టంగా బలి అయిపోయాయి. రేపటి తరం దీపాలెన్నో వెలుగులు విరజిమ్మకుండానే ఆరిపోయాయి. జరుగుతున్న చరిత్రలో బడులు కూలిపోవడం పాపం ! భవిష్యత్తుకు మహాశాపం ! ఈ నేరానికి, ఈ ఘోరానికి శిక్ష ఉందా ? మీకు మనస్సాక్షి ఉందా ? ఉంటే ఈ ఘోరాలు, నేరాలు రక్తపాతాలు మారణ హోమాలు జరగకుండా చూడండి. అయ్యో ! ఇంతటి నేరాల్ని, ఘోరాల్ని దేవుడు చూస్తూ ఊరుకున్నాడా ? దేవుడు ఏం చేస్తున్నాడు ? ఏం చేస్తున్నాడు...?

అదిగో దేవుడు కూడా ఏడుస్తున్నాడు. పాపం, ఏడుస్తున్నాడు ! ఏడుస్తున్నాడు !

నా కెందుకో మైకం కమ్ముతోంది. నా గొంతు మూగబోతోంది. నా కళ్లు మూతలు పడుతున్నాయి.!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
1-12-1993